# కేసీఆర్ అంటేనే..పేదలకు భరోసా

## నియోజకవర్గంలో 2463 మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు

### అర్హులందరికీ ఇండ్లు ఇప్పిస్తాం:ఎమ్మెల్యే దానం నాగేందర్



లబ్ధిదారురాలికి డబుల్‌బెడ్‌రూమ్ ఇంటి పొజిషన్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్,చిత్రంలో మంత్రి తలసాని తదితరులు

బంజారాహిల్స్,అక్టోబర్ 2: పేదలకు అండగా నిలిచేలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్ అంటేనే తెలంగాణ ప్రజలకు భరోసా అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మూడో విడత డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులుగా ఎంపికైన 1643మందికి సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే దానం నాగేందర్ పొజిషన్ సర్టిఫికెట్స్ అందజేశారు. కొల్లూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గానికి సంబంధించిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ మాట ఇచ్చారంటే కచ్చితంగా నిలబెట్టుకుంటారనే విషయం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ ద్వారా మరోసారి నిరూపణ అయిందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటిదాకా 2643 మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అందించామని, దరఖాస్తులు చేసుకున్న అర్హులందరికీ ఖచ్చితంగా త్వరలోనే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇప్పించే బాధ్యత తనదే అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు రానివారు నిరాశకు గురికావద్దని సూచించారు. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఇప్పటికే బీసీ బంధు కింద 300మందికి సాయం అందించామని, మైనార్టీలకు రూ. 1లక్ష సాయం అందించనున్నామన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అందుకున్న వారికి ఎమ్మెల్యే దానం శుభాకాంక్షలు తెలిపారు.

## డబుల్ బెడ్రూం లబ్ధిదారుల

# బస్సు యాత్ర ప్రారంభం



బస్సు యాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం

ఖైరతాబాద్, అక్టోబర్ 2 :ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న డబుల్ బెడ్రూం గృహాలకు గాను ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎంపికైన లబ్ధిదారులతో బస్సు యాత్ర సోమవారం ప్రారంభమైంది. నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజా వద్ద ఈ బస్సు యాత్రను ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. మూడో విడతలో భాగంగా 1643 మందికి డబుల్ బెడ్రూంలు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేందర్ బాబు, ప్రవీణ్ కుమార్, వనం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలి



నారాయణగూడలో నిరసన తెలుపుతున్న నాయకురాలు

హిమాయత్‌నగర్,అక్టోబర్2: మహిళా రిజర్వేషన్‌ను జాప్యం చేయకుండా అమలు చేయాలని ఎన్ఎఫ్ఐ డబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నారాయణగూడలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఉభయ సభలో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లును జనాభా గణన పేరుతో జాప్యం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి,నాయకురాలు పి.ప్రేంపావని,ఫామిదా,పడాల నళిని,అంజుమ్ పాల్గొన్నారు.

## ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి ఆదుకోవాలి

ఖైరతాబాద్, అక్టోబర్ 2 : రాష్ట్రంలోని ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నేత రాజిరెడ్డి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రత్యేక రాష్ట్ర సాధనలో భాగస్వాములమయ్యామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బంగారు తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక సంక్షేమ పథకాలు విజయవంతంగా ప్రజలకు చేరవేయడంలో తమ వంతు బాధ్యతగా నిలిచామన్నారు. త్వరలో జరుగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ అంశాన్ని చర్చించాలన్నారు. ఈ సమావేశంలో శ్రీధర్, జగదీశ్, సంతోశ్, గోవర్ధన్, విజయలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

## బీమా ఏజెంట్ల సంక్షేమం కోసం కృషి

హిమాయత్‌నగర్,అక్టోబర్ 2: దేశ వ్యాప్తంగా ఇన్సూరెన్స్ ఏజెంట్ల సంక్షేమం,హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు భారతీయ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వ కుమార్,ప్రధాన కార్యదర్శి జె.వినోద్ కుమార్ తెలిపారు.సోమవారం హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఏజెంట్లకు రావాల్సిన మెడిక్లెయిమ్, ఈఎస్ఐ,ఉద్యోగులకు పెన్షన్ వంటి సమస్యలపై నేడు,రేపు జరిగే కార్యవర్గ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు.హైదర్‌గూడలోని సెంట్రల్ పార్కు హోటల్‌లో జరిగే సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.ఈ సమావేశం లో సంఘ్ సౌత్ సెంట్రల్ జోన్ ఉపాధ్యక్షుడు ఫణీంద్రకుమార్,ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

## శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

బంజారాహిల్స్,అక్టోబర్ 2: తెలుగు సినీ పరిశ్రమకు పితామహుడిగా పేరుపొందిన రఘుపతి వెంకయ్యనాయుడు విగ్రహానికి చెందిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిలించాంబర్ సభ్యులు, సినీ ప్రేమికులు డిమాండ్ చేశారు. ఫిలింనగర్‌లోని ఫిలించాంబర్ వద్ద రఘుపతి వెంకయ్య విగ్రహానికి సంబంధించిన శిలా ఫలకాన్ని ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న అభిమానులు, పలు సంఘాల నాయకులు సోమవారం ఉదయం అక్కడకు చేరుకుని ఆందోళన చేపట్టారు.

## 'స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'

ఖైరతాబాద్, అక్టోబర్ 2 : ప్రైవేట్ రంగంలో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, మినిమమ్ వేజ్ బోర్డు మాజీ చైర్మన్ సామ వెంకట్ రెడ్డి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రైవేట్ ఉద్యోగుల సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు. పోలీసుల కేసులు, కంపెనీ యాజమాన్యాల బెదిరింపులు తట్టుకొని ధర్నాలు, రాస్తారోకోలు, మానవహారాలు నిర్వహించామని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ రంగంలో 75 శాతం రిజర్వేషన్లు కల్పించే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మియాపురం నాగేశ్వర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కాలసాని సంజయ్ రెడ్డి, పబ్లిసిటీ సెక్రటరీ సుధాకర్ నాయక్, మహిళా అధ్యక్షురాలు బి. ప్రవళిక, మేడ్చల్ అధ్యక్షురాలు అమర్ తదితరులు పాల్గొన్నారు.

## 'దాడులు చేయడం అప్రజాస్వామికం'

హిమాయత్‌నగర్,అక్టోబర్2: సమాజంలోని పౌర హక్కుల కోసం పోరాటాలు చేస్తున్న ప్రజా సంఘాలు, పౌర హక్కుల నాయకుల ఇండ్లపై ఎన్ఐఏ దాడులు చేయడం అప్రజాస్వామికమని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు అన్నారు.సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మావోయిస్ట్ పార్టీతో సంబంధాలు ఉన్నాయనే అభియోగంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కుట్ర పూర్వకంగా దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు.

# 6న మంత్రి తలసాని జన్మదిన వేడుకలు

### తెలంగాణ ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన ఫెడరేషన్ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

బంజారాహిల్స్,అక్టోబర్ 2: సినిమాటోగ్రఫీ శాఖమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను సినీ పరిశ్రమకు చెందిన సంఘాల ఆధ్వర్యంలో అక్టోబర్ 6న ఘనంగా నిర్వహించనున్నామని తెలంగాణ ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వి.కరుణాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2లోని ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సినీ కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్న మంత్రి తలసాని జన్మదిన వేడుకలను పండుగలా నిర్వహించాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ ఫిలిం ఫెడరేషన్‌తో పాటు తెలుగు ఫిలింఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న వేడుకల్లో సుమారు 6వేల మంది సినీ కార్మికులు పాల్గొననున్నారన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫిలిం ఫెడరేషన్ కార్యదర్శి హెచ్.మూర్తి, కోశాధికారి వి.ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్‌నెస్ పెంచడం కోసం డీఎఫ్ఎల్ పేరుతో లీగ్

బంజారాహిల్స్,అక్టోబర్ 2: రోటరీ క్లబ్ ఆఫ్ దక్కన్ హైదరాబాద్ సభ్యుల్లో ఫిట్‌నెస్‌ను పెంచడం కోసం దక్కన్ ఫిట్‌నెస్ లీగ్(డీఎఫ్ఎల్)–2023 పేరుతో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు అనిల్ రామ్‌చందానీ తెలిపారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద సోమవారం డీఎఫ్ఎల్–2023ని ప్రారంభించిన అనంతరం అనిల్ రామ్‌చందానీ మాట్లాడుతూ..రోటరీ క్లబ్ సభ్యుల్లో ఫిట్‌నెస్‌పై మరింత అవగాహన పెంచడంతో పాటు ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపేలా చూసేందుకు 28రోజుల పాటు డీఎఫ్ఎల్ పేరుతో కార్యక్రమం చేపట్టామన్నారు. దీనిలో భాగంగా ఏడుగురు సభ్యులతో ఉన్న ఆరు జట్లు ప్రతిరోజూ వ్యాయామాలు చేయాలని, ఎక్కువ సేపు వ్యాయామం చేసే జట్టును విజేతగా ఎంపిక చేస్తామన్నారు. ప్రతిరోజూ వ్యాయామానికి సంబంధించిన వీడియోలను తీసి తమకు పంపించాల్సి ఉంటుందని. అక్టోబర్ 29న విజేతలను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మీర్ ముర్తుజా అలీతో పాటు దేవేందర్ సురానా, సునీల్ జైన్, కిరణ్ గుత్తికొండ, పవిత్ర గుమిడెల్లి, సిమ్రాన్ మైనేని తదితరులు పాల్గొన్నారు.

## 'న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి'

ఖైరతాబాద్, అక్టోబర్ 2 : న్యాయవాదుల కోసం ప్రభుత్వ ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ చైర్మన్ బర్ల మల్లేశ్ యాదవ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదులు అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. ప్రస్తుతం న్యాయవాదులపై పలు చోట్ల దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని, వారికి రక్షణ చట్టం ఏర్పాటు చేసి భద్రత కల్పించాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10వేల స్టయిఫండ్‌తో పాటు హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ న్యాయవాదుల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ పోలాస శంకర్, రామకృష్ణ, నర్సింగ్, కన్వీనర్ విష్ణు, సహ కన్వీనర్లు భరత్, బాలకృష్ణ, పరుశురాం, స్పోర్ట్స్ పర్సన్ నరేశ్ గౌరీశం, సంతోష్, కుమార్, శివ పాల్గొన్నారు.

